క్లుప్తంగా

ఉత్తమ ఏఎన్‌ఎంకు సన్మానం



ఏఎన్‌ఎంను సన్మానిస్తున్న పాస్టర్లు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ పల్లె దవాఖాన ఏఎస్‌ఎం నాగరాణి ఇటీవల జిల్లా ఉత్తమ ఏఎస్‌ఎంగా అవార్డు అందుకోవడంతో ఆమెను మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాస్టర్ కేలోతు చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు దామోదర్‌పాల్, గౌరవ అధ్యక్షుడు ఆర్. డానియేలు, సలహాదారులు జీవరత్నం, ఎం. భిక్షమయ్య, శ్యాంసుందర్, సభ్యులు ఎం. ఎజ్రా, యేసుపాదం, ప్రసాద్ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు చేయూత



స్నాక్స్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించడానికి హంసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ సభ్యుడు పత్తెపురం విజయ్, విప్లవకుమార్, వెంకన్న, గణేష్, సాగర్, రాజు, లింగస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యక్షుడు అర్వపల్లికి పరామర్శ



అర్వపల్లిని పరామర్శిస్తున్న అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామానికి చెందిన అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, తిరుమలగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బందెల అర్వపల్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో అతడిని అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల గిరిప్రకాష్ పరామర్శించారు. అర్వపల్లి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోరెపల్లి వెంకటేశ్వర్లు, పగిడిమర్రి రామ్మూర్తి, కుంకుడుపాల రవీందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెపల్లి అంజయ్య, రాష్ట్ర కోశాధికారి నకిరేకంటి వెంకట్, పేరాల వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



నూతనకల్ : ఆర్థికసాయం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు వరికుప్పల సాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న మంగళవారం రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనకటి సునీత, వైస్ ఎంపీపీ జక్కి పరమేష్, ఉపసర్పంచ్ మన్నెం రమేష్, దేవాలయ కమిటీ చైర్మన్ కనకటి వెంకన్న, పెద్దింటి మధు, పాముల నగేష్, మన్నెం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న నిమ్మల శ్రీనివాస్‌గౌడ్

భానుపురి : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర శాఖ గ్రంథాలయంలో జరిగిన 2023 – 24 బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. 8 ఏళ్ల కాలంలో గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్య రెట్టింపు అయిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కేవీ. సీతారామశాస్త్రి, డైరెక్టర్లు రియాజుద్దీన్, దుగ్యాల రవీందర్‌రావు, లైబ్రేరియన్ రంగారావు, భాస్కర్, శ్రవణ్, విజయభాస్కర్, సృజన పాల్గొన్నారు.

రైతును వేధిస్తున్న మొగిపురుగు

- వరి పంటను ఆశిస్తున్న తెగులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



అనంతారంలో మొగిపురుగు ఆశించిన వరి పంట

పెన్‌పహాడ్ : రైతులకు మొగిపురుగు (కాండం తొలిచే పురుగు) ఓ శాపంలా మారింది. ప్రస్తుతం వరి పంటను మొగి పురుగు అధికంగా ఆశిస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. రైతులు యాసంగి సీజన్‌కు గానూ మండలంలోని 29వేల ఎకరాల్లో వరినాట్లు వేశారు. నాట్లు వేసి 20రోజులు గడిచింది. కానీ ప్రస్తుతం వరి పంటను మొగిపురుగు ఆశిస్తోంది. వరిపైరు ఎర్రగా మారుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేలా వ్యవసాయ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

కారణాలు..

పంట మార్పిడి లేకపోవడం వల్ల పంటలకు వ్యాధులు సోకుతున్నాయి. ఈ పురుగు ఆశించడానికి ప్రస్తుత వాతావరణ మార్పులు కూడా కారణం. సస్యరక్షణ చర్యలు చేపట్టకుండా యూరియా వినియోగిస్తుండటంతో వరిసాగులో పురుగు నియంత్రణ కష్టమవుతుంది.

నివారణకు వాడాల్సిన మందులు..

మొగి పురుగు నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులను వాడాల్సి ఉంటుంది. ఎకరాకు 8కేజీల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు వాడాలి. లేదా ఎకరాకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.3ని లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో నారు తీసేటప్పుడు గంట ముందు కిలో 4జీ గుళికలు వాడుకోవాలి. జింకు లోపాన్ని గుర్తిస్తే 2 కిలోల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఇబ్బందులు పడుతున్నాం



మొగి పురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వివిధ రకాల మందులు పంటకు పిచికారీ చేస్తున్నాం. పంటకు పురుగు సోకకుండా ఉండేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– ఐతరాజు నాగరాజు, రైతు, అనంతారం

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



వరి పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. మొగి పురుగు సోకితే రైతులు మాకు సమాచారం తెలిపాలి. మేము సూచించిన మందులు వాడుతుంటే పురుగును నివారించవచ్చు. ఎలాంటి సందేహాలు ఉన్నా మమ్ములను సంప్రదించాలి.

– బి. కృష్ణసందీప్, మండల వ్యవసాయ అధికారి

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేషం

భానుపురి : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడిగ మల్లేషం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐపీఎస్ అధికారిగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎన్‌కౌంటర్లు చేశారని గువ్వల బాలరాజు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తెలిపారు. గతంలోనూ తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ఇలాగే వ్యాఖ్యలు చేసి వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు పిడమర్తి దశరథ రాములు, దాసరి రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం కమిటీ ఎన్నిక



నియామకపత్రాలు ఇస్తున్న అధికారి, సర్పంచ్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో మంగళవారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కసుకు రమేష్, ఉపాధ్యక్షుడిగా ఈర్ల నర్సయ్య, కార్యదర్శిగా చాగంటి రమేష్, డైరెక్టర్లుగా సీహెచ్. ముత్తయ్య, కె. యాదగిరి, జె. ఉపేందర్, కె. ఖాసిం, జి. వెంకన్న, కె. రమేష్, సలహాదారుడిగా చాగంటి ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దబ్బేటి జ్యోతిరాణి, ఎన్నికల అధికారి రవికుమార్, కార్యదర్శి శ్రీనివాసరాజు, వార్డు సభ్యులు, మత్స్య కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులపై అదనపు భారం తగదు



భానుపురి : ఎస్‌ఈ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు



విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు

మద్దిరాల : ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదనపు చార్జీలు మోపడం తగదని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఈర్ధాల వెంకన్న అన్నారు. ఈ మేరకు మంగళవారం సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా డివిజన్ నాయకుడు గడ్డలి నర్సయ్యతో కలిసి రెడ్డిగూడెం విద్యుత్ కేంద్రంలో ఇన్‌చార్జ్ ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొంకూరి కృష్ణ, బూర్గుల సోమయ్య, పాపయ్య, శంకర్, బొంకూరి సునీత, బర్పటి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

అదనపు చార్జీలు ఉపసంహరించుకోవాలి

భానుపురి : ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై వేసే భారాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. అదనపు విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అదనపు చార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలు విద్యుత్ వినియోగానికి దూరమవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ రాంజీ, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు చంద్రకళ, జీవన్, హుస్సేన్, నగేష్, జయమ్మ, పద్మ, వాజీద్, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈఓ సురేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను శుభ్రం చేసి అందుబాటులోకి తేవాలన్నారు. శ్మశాన వాటికలను ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నారు. ఉపాధి హామీ పనులను గుర్తించి కూలీలకు పని కల్పించాలని సూచించారు. జనరల్ బాడీ సమావేశంలో మినిట్స్‌ను ఎప్పటికప్పుడు జిల్లాకు పంపించాలని అధికారులను ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు జనరల్ బాడీ సమావేశానికి హాజరుకావాలని, లేదంటే నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓను కోరారు. పంచాయతీరాజ్ ఏఈ బాబురావు మండల పరిషత్తులో మూమెంట్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్ నిర్వహించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఎంపీఓ సంజీవ, దయాకర్‌రెడ్డి, ప్రసాద్, స్వామి, జెడ్పీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, బిందుమాధవి, వెంకట్, అనిఫ్, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ



అర్వపల్లి : కుంచమర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, వైద్యసిబ్బంది

అర్వపల్లి : కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కుంచమర్తిలో మంగళవారం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఏఎస్‌ఎం పి. నాగరాణి, బీరవోలు వినోద, భిక్షమమ్మ, సుభద్ర, పుల్లమ్మ, నాగలింగమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో వైభవంగా కల్యాణోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మీలా మహదేవ్, తదితరులు

భానుపురి : పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న శ్రీరామాలయంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు అంబేద్కర్ నగర్ కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు మీలా మహదేవ్, అధ్యక్షుడు గుండా శ్రీధర్, సెక్రటరీ ఉప్పల సత్యనారాయణ, ట్రెజరర్ స్వర్ణ సింగ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశు సంపద సంరక్షణకు పాటుపడాలి

పెన్‌పహాడ్ : పశు సంపద పరిరక్షణకు పాటుపడాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్‌రావు రైతులను కోరారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులను సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడడం కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారులు యర్రంశెట్టి కిరణ్‌కుమార్, శ్రీజయసుధ, వెంకన్న, వీఎల్‌ఓలు శ్రీనివాస్‌రెడ్డి, జేవీఓ స్వరూప్, గోపాలమిత్రలు వెంకన్న, సైదులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు చేయించాలి

తుంగతుర్తి : మండల పరిధిలోని దేవునిగుట్టతండాలో మంగళవారం పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోతు ఈరోజీ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరంలో రైతులు తమ పశువులకు గర్భధారణ చికిత్స చేయించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే మందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యశాఖ ఏడీ రవిప్రసాద్, డాక్టర్లు నరేష్, మమత, గోపాలమిత్ర లింగయ్య, శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్ : అనంతారంలో పశువులకు టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి



తుంగతుర్తి : దేవునిగుట్టతండాలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఈరోజీ

హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



సూర్యాపేట రూరల్ : హక్కులపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ జీడి భిక్షం



నూతనకల్‌లో మాట్లాడుతున్న అధికారులు



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న ఆర్‌ఐ మట్టయ్య

నూతనకల్ : పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఎర్రపహాడ్‌లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ గాద్దుల రజితలింగరాజు, మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి, ఏపీఎం కర్ణాకర్, ఏపీఓ మామిడి శ్రీరాములు, ఆర్‌ఐ సుప్రజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పౌరులు హక్కులను కాపాడుకోవాలి

సూర్యాపేట రూరల్ : పౌరులు తమ హక్కుల గురించి తెలుసుకొని వాటిని కాపాడుకోవాలని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిన్నాయిపాలెం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు సంక్షేమ పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ప్రజలందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఉప సర్పంచ్ ఉప్పల వెంకన్న, ఆర్‌ఐ రవి, పంచాయతీ కార్యదర్శి నందు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : సమాజంలో పౌరుల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్‌ఐ మట్టయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానులేనని అన్నారు. అంటరానితనాన్ని ప్రోత్సహించే వారు శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓంకారం, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మీలా సత్యనారాయణకు నివాళి



సూర్యాపేట: గాంధీనగర్‌లోని వ్యవసాయక్షేత్రంలో నివాళులర్పిస్తున్న మీలా కుటుంబ సభ్యులు



భానుపురి : నివాళులర్పిస్తున్న నాయకులు



సూర్యాపేట : మాట్లాడుతున్న పెద్దిరెడ్డి గణేష్

సూర్యాపేట : స్వాతంత్య్ర సమరయోధుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ మీలా సత్యనారాయణ జయంతిని సూర్యాపేట మండలం గాంధీనగర్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీలా సత్యనారాయణ దంపతుల విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీలా సత్యనారాయణ కుమారులు మీలా మహాదేవ్, మీలా వాసుదేవ్, మీలా జయదేవ్, మీలా సహదేవ్, కుటుంబ సభ్యులు మీలా సందీప్ రవిశంకర్ పాల్గొన్నారు.

సుధా బ్యాంక్ ఆవరణలో..

సుధా బ్యాంకు వ్యవస్థాపక చైర్మన్ మీలా సత్యనారాయణ జయంతి వేడుకలను పట్టణంలోని సుధా బ్యాంక్ ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, డైరెక్టర్లు మీలా సందీప్, బోనగిరి భాస్కర్, శంకర్ లాల్, పానుగోటి నిర్మల, ఏపూరి శ్రవణ్ కుమార్, కక్కిరేణి చంద్రమోహన్ పాల్గొన్నారు.

మీలా సేవలు మరువలేనివి

భానుపురి : స్వాతంత్య్ర సమరయోధుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మాజీ మున్సిపల్ చైర్మన్ మీలా సత్యనారాయణ సమాజానికి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వరరావు అన్నారు. మీలా జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మీలా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శులు నాగుల వాసు, రుద్రంగి రవి, నాగు నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మంగళవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌ను సందర్శించి ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయ ఈఓగా వెంకటనారాయణ

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయ నూతన ఈఓగా నల్లగొండ జిల్లా అనుముల మండలం పేరూరు గ్రామంలోని స్వయంభు సోమేశ్వర స్వామి ఆలయంలో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ వెంకటనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆలయ ఈఓగా పనిచేస్తున్న ఎంపీ లక్ష్మణరావు నుంచి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

గురుకులానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఏ.రజాక్

మద్దిరాల : మద్దిరాలలో గురుకుల పాఠశాల భవన నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ గురుకుల పాఠశాల అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కస్తూరిబా పాఠశాల భవనం పక్కన ప్రభుత్వ స్థలం ఉండటంతో ఆ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రాంపాక నాగరాజు, గురుకుల పాఠశాల అధికారులు పాల్గొన్నారు.

తపాలా బీమా చేసుకోవాలి

నాగారం : అర్హులైన ప్రతి ఒక్కరూ తపాలా బీమా చేసుకొని ధీమాగా ఉండాలని సూర్యాపేట జిల్లా ఈస్ట్ సబ్ డివిజన్ అధికారి గౌని సురేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే అతిపురాతనమైన జీవిత బీమా పాలసీలను తపాలాశాఖ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. తపాలా జీవిత బీమా తక్కువ ప్రీమియంతో, ఎక్కువ బోనస్ ఇచ్చే ఏకైక పాలసీ అన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 1న తపాలా జీవిత బీమారోజుగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బీమా సౌకర్యాన్ని పొందాలన్నారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని సూచించారు. ఆయనతో పాటు పోస్టల్ సిబ్బంది ఉన్నారు.

కంటి వెలుగు శిబిరాల పరిశీలన



తుల్జారావుపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో కంటి పరీక్షల శిబిరాన్ని పరిశీలిస్తున్న రూపేందర్‌సింగ్

చివ్వెంల : మండల పరిధిలోని తుల్జారావుపేట గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో కంటి సమస్య ఉన్నవారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పూజ, సూపర్‌వైజర్లు శేషయ్య, శిరోమణి, పీఎంఓ పవన్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ రాజేందర్, ఏఎస్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అర్వపల్లి : 18 ఏళ్లు పైబడినవారంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ కోరారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరికీ అవసరాన్ని బట్టి ఉచితంగా మందులు, అద్దాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్‌ఓ చరణ్, ఆప్తమాలజిస్ట్ ఎ.వేణు, ఏఎస్‌ఎంలు సైదమ్మ, శకుంతల, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కళాజాతా

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని పలు కూడళ్లలో మంగళవారం ఆర్టీసీ ఆధ్వర్యంలో కళా బృందం సభ్యులు కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆర్టీసీ ప్రాముఖ్యతపై ప్రజలకు ఆటల పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఆర్టీసీ వృద్ధులకు, వికలాంగులకు, జర్నలిస్టులకు, డయాలసిస్ రోగులకు, విద్యార్థులకు రాయితీతో కూడిన సేవలను అందిస్తోందని తెలిపారు. ఆర్టీసీ కల్పించే సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ ఉపేందర్, జీఎంరావు, వార్డెన్, కళాకారులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో ప్రజల అవస్థలు



గ్రామశివారులో బురదమయంగా మారిన రోడ్డు



ఓవర్‌హెడ్ ట్యాంక్ సమీపంలో..

అర్వపల్లి : అర్వపల్లి–కొమ్మాల రహదారిపై కాసర్లపహాడ్ గ్రామ శివారులో ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి గ్రామం వరకు బీటీ పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైంది. ఈ గుంతల్లో నీళ్లు చేరి దారి బురద మడుగులా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును మరమ్మతు చేయించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు నల్లగుంట్ల రవి తెలిపారు. వెంటనే బీటీ రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.